క్లుప్తంగా

కొలతల ప్రకారం పని చేయాలి



చాట్రాయి: కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పర్వతాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు మండుతుండటంతో ఉదయాన్నే పనుల్లో పాల్గొనాలని, తాగు నీరు సమకూర్చుకోవాలని, చేసిన పనికి ఖచ్చితమైన కొలతలు వేయాలని చెప్పారు.

మజ్జిగ పంపిణీ



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రంలో మంగళవారం కోట వేణుగోపాలరెడ్డి కుమార్తెలు కోట ఆపేక్ష, సౌమ్యస్ఫూర్తిలు బాటసారులకు మజ్జిగ, కూలింగ్ వాటర్ పంపిణీ చేశారు. ఐ నీడ్స్ ఆప్టికల్స్ యజమాని వుల్లారెడ్డి, ఆలమూరి చంద్రం, తిరుపతిరెడ్డి, మల్లికార్జున్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మెయిన్ బజార్‌లోని డీఎల్‌కే మార్కెట్ సమీపంలో రోడ్డు పక్కన మంగళవారం పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి తాగునీరు ఎగిసి పడింది. నీరు వృథాగా పోవడంతో పాటు రోడ్డుపై వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగింది. రోడ్డుపై వెళ్లేవారిపై ఎగిసిపడుతున్న నీరు పడటంతో తడిసిపోయారు. కొండపల్లి మున్సిపాల్టీలోని నీటి సరఫరా వ్యవస్థపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తాగునీరు వృథాగా పోతున్నా మూడు గంటల పాటు సిబ్బంది పట్టించుకోలేదు. పైప్‌లైన్ లీకేజీలను సరి చేయాలని, సిబ్బంది పర్యవేక్షణ ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించండి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఐఈఆర్టీ కో–ఆర్డినేటర్ లంకే వెంకటేశ్వరరావు తెలిపారు. దివ్యాంగుల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం గుంటుపల్లిలో మంగళవారం నిర్వహించారు. దివ్యాంగ బాలిక ఇంటికే పరిమితం కావడాన్ని గుర్తించారు. దివ్యాంగ బాల బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలకు తల్లిదండ్రులకు వారు వివరించారు. ఇంట్లో ఉంచితే మానసిక ప్రశాంతత ఉండదన్నారు. అందరితో పాటు పాఠశాలల్లో చేర్చడం ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటారని, సామాజిక అంశాలపై అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా అనేక రకాల ప్రయోజనం పొందుతారని వివరించారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

సాయి ప్రియకు ఉత్తమ మహిళా సైకాలజిస్ట్ అవార్డు



ఆగిరిపల్లి: మానసిక ఆరోగ్య సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా డాక్టర్ పేట సాయి ప్రియకు ఉత్తమ మానసిక వైద్య నిపుణురాలు–2025 మహిళా అవార్డు లభించింది. మండలంలోని కనసానిపల్లికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పేట సాయిప్రియ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన, శిక్షణ ఇచ్చినందుకు గుర్తింపుగా తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని భాస్కర్ ఆడిటోరియంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డు అందజేశారు. సాయి ప్రియ మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మోతుకూరు రామచందర్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నాగజ్యోతి, ఏపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శ్రీపతి జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా అలివేలమ్మ తిరునాళ్ల

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు గ్రామంలో అలివేలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతోంది. మహోత్సవాలలో భాగంగా అమ్మవారు, సహదేవతలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే!

- పీజీఆర్ఎస్‌లో పెరుగుతున్న అర్జీలు
- ఫిర్యాదులపై స్పందించని అధికారులు
- అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం



తిరువూరులో జరిగిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజలు (ఫైల్)

తిరువూరు: గత ఏడాదికాలంగా తిరువూరు డివిజన్‌లో ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులను ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని తిరువూరులో ఈనెల 12న జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో స్వయంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బహిరంగంగా చెప్పడం డివిజన్‌లో చర్చనీయాంశమైంది. ప్రతి వారం తహసీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల్లో, రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కోసం నాలుగు గంటలు కేటాయిస్తున్నారు. అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ఆయా కార్యాలయాల్లో పనులు సైతం నిలిచిపోతున్నాయి. అయినప్పటికీ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలను సంబంధిత అధికారులు మొక్కుబడితంతుగా పరిష్కారమైనట్లు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం

తిరువూరులో కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అత్యధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే ఫిర్యాదులు వచ్చాయి. రీ సర్వేలో అవకతవకలు, భూముల సర్వే నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం, పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్స్ జారీ చేయకపోవడం, సరిహద్దు తగాదాలపై ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కరించకపోవడంపై రైతులు, భూ యజమానులు పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించారు. రెవెన్యూ శాఖలో నెలకొన్న పెండింగ్ సమస్యలపై 104 అర్జీలు రాగా, సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డులకు సంబంధించి 35, పోలీసు శాఖపై 28, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 21, తిరువూరు నగర పంచాయతీపై 18, సామాజిక పెన్షన్లు, పౌర సరఫరాలు, గృహ నిర్మాణం తదితర శాఖల్లో అపరిష్కృత సమస్యలపై పదుల సంఖ్యలో అర్జీలను సమర్పించారు. మొత్తం 283 అర్జీలు పీజీఆర్ఎస్‌లో రాగా, వీటిలో తిరువూరు మండలంలో అత్యధికంగా 146, విస్సన్నపేట నుంచి 47, గంపలగూడెం నుంచి 45, ఎ.కొండూరు నుంచి 38, రెడ్డిగూడెం నుంచి ఏడు అర్జీలు వచ్చాయి.

వందల సంఖ్యలో అర్జీలు

తిరువూరు డివిజన్‌లోని తహసీల్దారు కార్యాలయాల్లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రజా దర్బార్ నిర్వహించి వందల సంఖ్యలో అర్జీలు స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ జరిగిన మండలాల్లో అధికారులను సైతం ఎమ్మెల్యే భాగస్వాములను చేశారు. అయితే ఈ ప్రజా దర్బార్‌లో ఇప్పటివరకు ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటిలో ఎన్ని అధికారులు పరిష్కరించారో ఏనాడూ వెల్లడించలేదు. తమ సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరిస్తారనే ఆశతో వచ్చిన గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వ్యయప్రయాసలే మిగిలాయి. ఆన్‌లైన్‌లో నేరుగా ప్రజలు సమర్పించే అర్జీలు సైతం పరిశీలించకుండానే అధికారులు పరిష్కరించినట్లుగా నమోదు చేస్తున్నారని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల గోడు పట్టించుకోండి



ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందనే ఆశతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పిస్తున్న సామాన్యులకు అధికారుల నుంచి సమాధానం కరువవుతోంది. స్పందన లేని వేదికలతో సమయం వృథా చేయడం ఎందుకు? ఇకనైనా ప్రజల గోడు పట్టించుకుని వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో మారుమూల ఉన్న తిరువూరు డివిజన్‌లో కనీసం నెలకు ఒక్కసారైనా కలెక్టర్ పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రజలకు సమాచారం ఇవ్వాలి



గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసిన అర్జీదారుకు తదుపరి ఎటువంటి సమాచారం లేకపోవడంతో అర్జీ ఎక్కడ ఉంది, ఎప్పటికి పరిష్కారమవుతుందనే అంశాలు తెలియడం లేదు. ఆన్‌లైన్‌లో చూసుకోమని చెబుతున్న అధికారులు ఎందుకు వాటిని పీజీఆర్ఎస్‌లో నమోదు చేయడం లేదో అర్థం కాదు. ఇకనైనా పారదర్శకంగా పీజీఆర్ఎస్ నిర్వహించాలి.

– కాలసాని గోపాలనాగేశ్వరరావు, తిరువూరు

అరకొరగా పశువుల దాణా అందజేత



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ కార్యక్రమం మంగళవారం అరకొరగా జరిగింది. దీనిపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక పశు వైద్యశాల వద్ద జరిగిన కార్యక్రమంలో 50 కిలోల బస్తాలు 20 మంది రైతులకు ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న ఇతర రైతులు అక్కడికి చేరుకుని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో 160 మంది రైతులు ఉండగా కేవలం 20 మంది రైతులకు దాణా పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇటువంటి విధానం సరికాదన్నారు. పశువుల దాణా ప్రస్తుతం 20 మంది వరకు మాత్రమే వచ్చిందని, మరో విడతలో మిగిలిన రైతులకు దాణా వచ్చేలా చూస్తామని లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ రైతులకు నచ్చజెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మైలవరం: మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన బాణావత్ భాస్కరరావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందాడు. బాణావత్ భాస్కరరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.86 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ల ద్వారా లబ్ధిదారునికి చెక్కును సోమవారం రాత్రి అందజేశారు. లబ్ధిదారుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.

భూ పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి రవి

ఆగిరిపల్లి: దళితుల భూములను పెత్తందారులు ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి హెచ్చరించారు. మండలంలోని తోటపల్లిలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ స్వాధీన ఉద్యమం ద్వారా చిన్నాగిరిపల్లి దళితులు సాగు చేసుకుంటున్న భూములను భూ పోరాట కమిటీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కష్ట జీవులకు ఎల్లప్పుడూ ఎర్ర జెండా అండగా ఉంటుందన్నారు. ఈ భూ పోరాటానికి సీపీఎం సంఘీభావం తెలుపుతుందని చెప్పారు. తోటపల్లి రెవెన్యూ గ్రామంలో ఉన్న 40 ఎకరాలను భూస్వాములు ఆక్రమించుకొని పేద దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతుంటే సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ చట్టం ప్రకారం ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన భూములను ఎవరు కొనుగోలు చేసినా అవి పేదలకు చెందుతాయన్నారు. దళితులతో కలిసి భూముల్లో బాగు చేత కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, ఎం. నరేష్, రంగారావు, కుమారి, వాణి, అర్జున్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంలో పట్టు సాధించాలి



నూజివీడు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

మైలవరం: కొందరు విద్యార్థులు మ్యాథ్స్ సబ్జెక్టు అంటే భయపడుతుంటారని, నిజానికి మెలకువలు తెలుసుకుంటే గణితం చాలా సులభమని మైలవరం జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు పి. ప్రసాదరావు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు గణితశాస్త్రంలో బోధనా పద్ధతులను వివరించారు. ఆయన మాట్లాడుతూ కొందరు విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో కచ్చితంగా గణించడమనేది తమ శక్తికి మించిన పనిగా భావిస్తారని, అదే భావన వృక్షంగా పెరిగి పెద్దదై ఉన్నత తరగతులలో కూడా వారి ప్రగతికి అవరోధం కల్పిస్తుందన్నారు. గణిత శాస్త్రంలో మెలకువలను వివరించారు. విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన..

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. దీనిలో భాగంగా మంగళవారం విద్యార్థులు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయడం, పుస్తక ప్రదర్శన తిలకించడం, కథలు చెప్పడం తదితర కార్యక్రమలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన కృషిని, స్వాతంత్ర్యానంతరం దేశంలో ఎదురైన అలజడులను చాకచక్యంగా ఎలా అణిచివేశారో విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయానికి వచ్చి విజ్ఞాన పుస్తకాలను చదువుకోవాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాలను సేకరించాలి



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆగిరిపల్లి: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. వడ్లమానులోని రైతుసేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలోని రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు మట్టి నమూనాలు సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు భూసార పరీక్షలు చేయించడం వలన భూమికి కావాల్సిన ఎరువులను మాత్రమే వాడి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది నిర్ణీత సమయంలోగా మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి సకాలంలో పంపించాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు, వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: భూ సంరక్షణ కోసం ప్రతి రైతూ తమ భూముల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని చాట్రాయి గ్రామంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎకరంలో ఐదు చోట్ల వి ఆకారంలో 15 సెంటీ మీటర్ల లోతులో కిలో మట్టిని తీసుకుని ఎండలో ఆరబెట్టి మెత్తగా చేసి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షల వలన భూమిలో సూక్ష్మ పోషకాలు, స్థూల పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింకు, సేంద్రియ కర్బన పదార్థాలు సమపాళ్లల్లో ఉన్నది, లేనిది తెలుస్తుందని చెప్పారు. రైతులు తమ భూముల్లో మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

సీబీఎస్ఈలో కుమార్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పాఠశాల టాపర్ నిషాంత్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటకుమార్



మోహన్ కృష్ణ అనిరుధ్

నూజివీడు: మండల పరిధి బోర్వంచ శివారు కొత్తూరులోని కుమార్ సీబీఎస్ఈ స్కూల్ పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పిన్నమనేని వెంకట కుమార్ మంగళవారం తెలిపారు. పాఠశాల నుంచి 41 మంది పరీక్షలు రాసి 100 శాతం ఉత్తీర్ణతను సాధించారన్నారు. పది ఫలితాల్లో దాసరి వెంకట సుబ్బారావు నిషాంత్ 500కి 483 మార్కులు, బండ్ల రెబకా కిరణ్మయి 476 మార్కులు, గర్నేపూడి నిహారిక 476 మార్కులు, గంగుల అనంత సాయి మణికంఠ 474 మార్కు లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ పిన్నమనేని సంధ్యాలక్ష్మి అభినందించారు.

సత్తా చాటిన ఆగిరిపల్లి విద్యార్థులు

ఆగిరిపల్లి: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఆగిరిపల్లి విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం విడుదల చేసిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఐదు వందల మార్కులకుగాను ఆగిరిపల్లికి చెందిన దాసరి వెంకట సుబ్బారావు నిశాంత్ (483), తవ్వా మోహన్ కృష్ణ అనిరుధ్ (471), యాదాల తేనేష్ (461) మార్కులు సాధించారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆంజనేయులు, సుధాకర్ తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న జరుగనున్న కార్మికుల సమ్మెలో తాము పాల్గొంటున్నామని కొండపల్లి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తనకు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆప్కాస్‌ను కొనసాగించి జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ వయో పరిమితి 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు బి.అప్పారావు, జి.సురేష్, దేవుళ్ల, రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

మైలవరం: లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరుగ జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చాట్ల సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి మాధవరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, సీఐటీయూ రెడ్డిగూడెం మండల కమిటీ సభ్యులు రామారావు, రజిని, వాణి, కౌలు రైతు సంఘం నాయకులు వీరాస్వామి, జి. అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోలుకోడు దళితవాడలో దాహం కేకలు

మైలవరం: మైలవరం మండలం తోలుకోడు దళితవాడలో స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దళితవాడలో తాగునీటి పంపిణీకి గ్రౌండ్ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసినా దానిలో చుక్కనీరు రావడం లేదు. తోలుకోడు ప్రజలకు తాగునీరు అందించేందుకు కృష్ణా వాటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు. గత ఐదు రోజులుగా నీరు రాక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నామని గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు ఇంకొల్లు జమలయ్య తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వేసవి కాలం కావడంతో గొంతెండుతోందని, అధికారులు స్పందించి దళితవాడ వాసులకు కృష్ణా నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మురళీ నాయక్‌కి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గిరిజన సంఘ నాయకులు

చాట్రాయి: భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన మురళీనాయక్‌కి మండలంలోని పోతనపల్లి తండాలో సోమవారం రాత్రి గిరిజనులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి అమర్ రహే నాయక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా నాయకులు మంగయ్య, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల అరెస్ట్

తిరువూరు: సారా కాస్తూ పలుమార్లు పట్టుబడి మళ్లీ నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తులను తిరువూరు ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. తిరువూరు సర్కిల్ ఎ.కొండూరు మండలంలోని గొల్లమందల తండాకు చెందిన భూక్యా సుక్కో, గోపాలపురం తండాకు చెందిన దరావత్తు రాము, విస్సన్నపేట మండలంలోని కలగర రామచంద్రాపురానికి చెందిన తేళ్లూరి నారాజు, కలగర తండాకు చెందిన బాణావతు కోటేశ్వరరావు, తాతకుంట్ల తండాకు చెందిన జోనిబోయిన కృష్ణ, తెల్లదేవరపల్లి తండాకు చెందిన అంగోతు తిరుపతమ్మ, దారావతు రమేష్, రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వకు చెందిన గుజ్జర్ల వెంకటేశ్వరరావులను తిరువూరు కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ చెప్పారు.

చట్టాలపై బాలికలకు అవగాహన



జి.కొండూరులో కిశోరి వికాసంలో పాల్గొన్న బాలికలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ సత్యశ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న చంద్రకళ

జి.కొండూరు: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు గ్రామంలో బాలికలకు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు లీల, ఇంద్రజలు బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.వాణి, ఈ.నాగమణి, బి.జయ కుమారి, పి.విష్ణు చందన, బి.జ్యోతి, ఎం. మేరీ పాల్గొన్నారు.

కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నూజివీడు: మైనర్ బాలికల రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని నూజివీడు పట్టణ సీఐ పి.సత్యకిశోర్ అన్నారు. పట్టణంలోని రామాయమ్మరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

చాట్రాయి: బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఎస్‌కే చంద్రకళ అన్నారు. చాట్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వలన పుట్టే పిల్లలు అనారోగ్యంగా పుడతారని, మానసికంగా ఎదగలేరని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి సామూహిక కుంకుమార్చన

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం గ్రామ శిల బోనాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై నిర్వహించిన శివలీల, వినాయక చవితి నృత్య రూపకం చూపరులను ఆకట్టుకుంది.